అతిథిదేవుఁడు

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు

కాకినాడలో ఒకయిల్లుమాత్రమే ఆనందరావు ఆస్తి. అతనికి సంబంధించిన తతిమ్మా ఆస్తి యావత్తూ భార్యాద్వారా సంక్రమించినదే.

స్త్రీధనమువలన జీవింపవలసిన దైన్యమతనిని అతిగా బాధించినది. కావున తన భార్య జ్యోతికి వచ్చు ఆస్తిలో రెండులక్షలు నిలువచేసి తనపేరున పాతమూరు అనుగ్రామము కొన్నాఁడు.

ఆనందరావిపుడు తనపేరున కాకితముతో నెక్కిన ఆస్తి చూచికొని పూర్వపు దైన్యము వదలివేయఁగలిగెను. లోకులు మాత్రము పాతమూరుకూడ జ్యోతిదేయని వ్యవహరించుకొనుచుండువారు. జ్యోతికిని ఆనందరావునకును అటువంటి వ్యవహారమెన్నఁడును కలుగలేదు. ఆఁడుదానికి మగవాఁడే దైవము. మగవానికి మఱిలేఁడుకదా!

ఆనందరావునకు నియోగులకుండు ఆత్మగౌరవ మెక్కువ. వైదికులందు భక్తియు అధికమే. యాచింపవచ్చు అవధానులకు నాలుగైదునాళ్లు స్వహస్తముగా భోజనము పెట్టి రొండిని పెట్టుకొనుటకు నాలుగైదురూకలకు తక్కువ లేకుండ ఇచ్చువాఁడు. ఆబస్తీలో యాచకుల కందఱకు ఆయిల్లే యింత హావిస్సు ఇచ్చును.

ఆనందరావు మంచి పేకాటగాఁడు. అందు అందఱకు బాకీలేకాని ఎవరికిని ఏనాఁడును తీర్చినటులు తోఁపదు. ఎవరైనను ఇంటికి వచ్చి అడిగినపుడు ఆనందరావు తాళపుఁజెవులకు తడవులాడుకొనుచుండఁగా అతని గుమాస్తా వెంకటరావు అది కనిపట్టి 'ఇపుడు డబ్బులేదు పో!' అని బోకరించుచుండువాఁడు. అటులు బోకరించుట ఆనందరావునకు ఇష్టము కాకపోయినను ఊరకుండువాఁడు. జ్యోతిమాత్రము మనస్సునందు పరితపించుచుండెడిది.

౨

చిననాఁటనే తలిదండ్రులు పోవుటవలన వెంకటరావు గాలికి పెరిఁగెను. ఉన్నపొలము కొంచెము అమ్ముకొని మెట్రిక్యులేషన్‌దాఁక వచ్చెను. ఆఱుదండయాత్రలు చేసెనని సహాపాఠులందురుకాని యతఁ డొప్పుకొనఁడు. అయిదేండ్లుమాత్రమే తప్పితినని యతఁడు వాదించును. వెనుకటి రికార్డు తగులఁబడిపోవుటవలన ప్రతివాదులావిషయమున పోరాడరు. అంతటితో ఆచదు వంతమయినది.

కొన్నాళ్లు నాటకసంఘములో తిరిగెను. కంఠమున కాకి అధిదైవతముగా ఉండుటవలనను, ఆంధ్రమున ఆదరను లేకపోవుటవలనను అందులకును తిన్నగా పనికిరాలేదు కాని ఆ నాటకరంగము ప్రసాదించిన ఆడంగిరేకుల గుణములు లోనగునవి కొన్ని అతనియందు నిలిచి పోయినవి. పిమ్మట వెంకమ్మ అను ఒక దక్కు మాలిన విధవను తీసికొనివచ్చి ఆమెచే పూటకూళ్లు సాగించెను. అఱవవారితో పోటీచేయ లేకపోవుటవలన అందులను కడుపునిండ తిండి దొరకలేదు. అయినను ఆవ్యాపారము ఇంకను మానలేదు. ఆనలి యాధారము చూచుకొని కాని యీవలి యవలంబనము పురుగేని వదలదు కదా!

సరిగా ఆసమయమునకే ఆనందరావు పొతమూరు కొనుట సంభవించినది. ఆనందరావు సొంతయాస్తికి ఒక సొంతగుమాస్తా కావలసివచ్చెను. వెంకటరావు అతికెను.

ఆనందరావు తనగుమాస్తాను తనయింటనే భుజింపుమని యనునుగాని పండుగునాఁడైనను వెంకటరా వందులకు సమ్మతింపలేదు. సాటివానియింట తినుట గౌరవమునకు హాని యని యతని విశ్వాసము.

శూద్రుఁడు బ్రాహ్మణునియింటి కతిథిగా వెళ్లునుగాని సాటీశూద్రునింటికి చనఁడు. సాటీ వానియింట కులగౌరవమున కేమి లోపము వచ్చునో యని వానికి జంకు. తనకన్న ఎక్కువకులమువాఁడగు బాపనియింట తనకు మర్యాదలేకపోవుటయే మర్యాదయని యతని విశ్వాసము. కాని యేయింటనైనను వైదిక బ్రాహ్మణునకు మాత్రము పకోశమునను శంక లేదు.

వెంకటరావు పరగృహమున విస్తరివేసి యెఱుఁగఁడు. అతనికి పూటకూలి యింటనే అన్నప్రాశమయినది. అతనికదే స్వగృహము. పూటకూలియింట ఎంత స్వాతంత్ర్య ముండునో నిర్ణయింప వెంకటరావు ప్రమాణము. పలయనఁగా ఆహా ఈపీఁట లెంత తేలికగా ఉన్నవో చూడుఁడు! అని పొగడుచు ఆకాశమున కెగుర వేయువాఁడు. అవి క్రిందఁబడి యిబ్బడి యగునవి. మంచినీరు అడుగుటకు క్రిందపఱచియున్న నాపరాతి మీఁద జర్మనీగ్లాసుకొట్టి 'నాకెంత ముద్దు



కుదురున్నదో నీకును అంతయే' అని నిందించుచు నీరు పోయించుకొని చేపట్టు వదలు

వాఁడు. కొన్ని విస్తళ్లమీఁదుగా ఆవలఁద పోవుచుండఁగా విస్తరిలోని అన్నముతీసి అడ్డు కట్టలు* ఆనకట్టలు పోయుచుండువాఁడు. ఇట్టి పనులవలన వెంకటరావు ప్రమాణముకాఁడని యెవఁ డనఁగలఁడు ?

3

దైనందినమును పలువురు వచ్చుచుండుట వలనను వచ్చినవారి కందఱకు జ్యోతియే పలురకముల వంటలు చేసిపెట్టుటవలనను వెంకటరావు తన యజమానుని యింటినిగూడ పెద్దపూఁటకూళ్లయింటినిగా పరిగణించుటయే కాక జ్యోతినిగుఱించి ప్రక్కగుమాస్తాతో పెద్దవంట లక్కయని వ్యవహరించుచుండును. 'ఆనందరావు పిల్లజమీందారు. పిల్లజమీందారేమి ? పెద్దజమీందారే. జ్యోతి కిఱువది వేలువచ్చును. తనకు పదివేలు వచ్చును. ఇంత ఆదాయముకల యిల్లాలు సొంతచేతులతో వంట చేసిపెట్టుట వైదికకుటుంబములలోనే లేదే! ఇఁక నియోగిబిడ్డయా ' అని తనకే నామర్దాగా నున్నటులు వెంకటరావు లజ్జించుచుండువాఁడు.

వంటవాఁ డనఁగానే ఆచారవ్యవహారములు తిన్నగా జరుగవని జ్యోతియే వంట చేసికొనును. కాని ఆనందరావు కొన్నాళ్లు వంటవాని ముచ్చటలు చూడక మానలేదు. వంటవానితో తానుగూడ ప్రతినిమిషము ఉండవలసి వచ్చుటచేతను, వైదికబ్రాహ్మణులు తిండి కుండకపోవుటచేతను, అవధానులకు తన యింటనే విందులిడి వారిచే ఆశీర్వాదము పొంది తత్ఫలముగా పుత్రప్రాప్తికుతూహలము పొందియుండుటచేతను ఆనందరావు నింట వంటవానికి మఱి ప్రవేశము లేకపోయినది. ఆపత్కాలమున ఏయవధానులుగారో వంటచేసి పెట్టువాఁడుకావున వారికి ఆవిషయమున ఆట్టి కష్టము కలుగలేదు.

పంక్తిలో బ్రాహ్మణుఁడు లేనియెడల ఆనందరావున కానాఁడు పస్తే. ఒకనాఁడు బ్రాహ్మణుఁడు లేని దుర్దినము తటస్థించినది. వెంకటరావును ఆహ్వానించెనుగాని యాతఁడవపండుగునాఁడు వచ్చెదనన్నాఁడు. బలవంతము చేసినకొలఁది బిగిసినాఁడు. తుదకు జ్యోతి యింటిలోనుండి వెలుపలికి వచ్చి 'నాయనా! నీవు వచ్చిననాఁడే మాకు పండువు. నామాట నయినను మన్నింపు'మని యడుగఁగా వెంకటరావు తల యూఁపినాఁడు.

ఆఁడుగా'నిమాటలో తల్లిప్రేమయు, మిత్రుని యనురాగమును, గురువునాజ్ఞయు నున్నవి. వెంకటరావు హృదయశిల జ్యోతిప్రార్థనచేఁ గరఁగినది. వెంకప్పకు కబురంపి అక్కడనే ఆఁగిపోయినాఁడు,

ఆనందరావు స్నానమయినది. వెంకటరావు నిఁక స్నానము చేయు మన్నారు. వెంకటరావున కచట స్నానముచేయ సందేహముగానే యున్నది. ఏలనఁగా వెంకటరావెపుడును భూదేవత కర్పించుటయేకాని తన బట్టను తాను పిడుచుకొని యాఱవైచికొనుట యెఱుఁగఁడు. అందును పరగృహమున తన బట్ట తాను పిడుచుకొని ఆఱఁగట్టుకొనుట

యెంతకష్టము! కాని ఆగ్రీష్మాంతమున అడవి జంతువులు కూడ జలకమాడక తప్పవు. అందువలన అతఁడును ఎట్టులో స్నానము చేసెను. ఉదకము యొక్క శబ్దము ఎవరికిని వినిపింపని లాగున బట్ట పిడుచుచుండెను. బట్టయొక్క ఒకచెంగు పృథివీగంధమును మూచూచుచున్నది. రెండవ చెంగు చేతులలో నున్నది.

వెంకటరావెంత సేపటికిని లోనికి రాలేదేమి యని జ్యోతి యచటికి రాఁగనే ఆపరాభవము సహింపలేక వెంకటరావు తన పనిని తొందరగా ముగింప తొక్కిసలాడుచుండఁగా జ్యోతి 'ఆపని నీకెందులకు? దాని పిడిచి ఆఱవైచునుగదా! లోనికి వచ్చి మడి గట్టుకొనుము' అనుచుండఁగా చేతులలో నున్న రెండవ చెంగుకూడ కుసుమాంజలివలె నేలపైఁ బడెను.

'అబ్బే! నే నేమియుచేయుట లేదు. క్రిందపడవైచుచునే రాఁబోవుచుండగా మీరే వచ్చితిరి' అని లోపలికి వెళ్లి పీటమీఁద నున్న మడిబట్ట కట్టకొనుటకుఁగూడ మొదట కొంచెము సందేహించెను. ఏలనఁగా వెంకటరావునకు మడిబట్ట కట్టుకొనుట అనునది అదిగో మొదలు. కట్టువిడిచినబట్టగాని, చాకిపుడిపోగాని తనదేమియు నవట లేమి దానిని కట్టుకొనక తప్పినదికాదు. ఆమడిమడుపు కట్టుకొనుచుండఁగా వెంకటరావునకు గగురు పొడిచినది. ఆవలిపెమున నతఁడు మృదుస్పర్శ ననుభవించుటకు బదులు గఱుకుముండ్ల స్పర్శ ననుభవించెను. కాని కట్టుకొనిన కొంత సేపటికి దాని పరిశుభ్రత ప్రత్యక్షము కాపుట మొదలు పెట్టినది. ఏలయనిన అది సామాన్యముగా పరులకు మడిబట్టగా ఇచ్చు తలంటు కొల్లాయ గుడ్డకాదు. పాపమది మృదుల వస్త్రము.

అందాఁక పద్మాసనము వేసికొని కూరుచున్న ఆనందరావు అపుడే కనులు తెఱచెను. నగ్నమయిన తన వైచ్యము ఆనందరావు కనులార చూచిపోయినటులు వెంకటరావు మనస్సులో రాయిపడ్డది.

వెంకటరావునకు తూష్ణీం సంధ్యావందనము చేయుటమైనను చేతకాలేదు. చిన్నపుడు జ్యామెట్రీలో నేర్చికొనిన సర్కిల్ ఒకటి వేసినాఁడుకాని ప్రాణాహుతు లభినయించుట చేతకాలేదు. వాని యన్నిటిమాట యటుండఁగా అన్నము తినుటకూడ చేతకాలేదు.

పెద్దమనుష్యులలో అన్నము తినుట చాలఁగష్టమే. తమకు భిన్నమయిన ఏయాచారములు సంభవించినను పెద్దలు వానిని మ్లేచ్ఛాచారముల క్రింద కట్టుదురు. తుదకు రుచిలోను అంతియే. పిన్నలలోఁగూడ ఒక వింత లేకపోలేదు: కావలసిన నోపదార్థము గాని యడుగుట తమకు మానహానిగా తలఁచుటయు, వడ్డించుచుండఁగా చాలుఁ జాలునని మొగము చిట్లించుకొని తత్క్షణము కొంత యాపలఁ బాఱవైచుటయు.

వెంకటరావునకు పూఁటకూటి యింటి రాచఱికము, ఆనందము ఒక్కసారిగా మాయమయిపోయి దాస్యదుఃఖము లారెంటి స్థాన

ములను ఆక్రమించుకొనెను. ఆనందరావునకు భోజనవేళలో మూఁడేండ్లనుండి మూకవ్రత ముండుటచే సరిపోయినది కాని కానిచో అతని ప్రతిమాటయు శూలమువలె వెంకటరావును బాధించియుండును. నడుమనడుమ

తల్లి ప్రేమతో ఇదికావలయునా అదికావలయునా అని యడుగుచు ఆరంగ మధ్యమునకు జ్యోతియే రానియెడల వెంకటరావున కంధకారమునందు భుజించునటులు ఉండెడిది.

వెంకటరావు కడుపు నిండలేదని జ్యోతికి తెలియును. ఏలయనఁగా ఆమె సిగ్గునకును ఆఁకలికిని జరిగిన పోరాటమును కనులార చూచినది. మఱిమఱి యడుగుచో ముడుచుకొనిపోవు నాతని నాగరకతాదేవత కెఱుఁగనటులు బలియిడినను అది ప్రసన్నముకాలేదు.

'వెంకటరావూ! నీవు పదినాళ్లపాటు మాయింట భోజనము చేయవలయును. వెంకమ్మను పదినాళ్లపాటు మావదినెగారియింట నుంపవలయు' నని జ్యోతి యన్నది.

ఆపది దినములలోను ప్రాణములు పోవు ననుకొన్నాఁడు వెంకటరావు. జ్యోతి మొగము చూచినాఁడు ఆనందరావు. వెంకటరా వేమియు సమాధానము చెప్పలేదు. ఇరువురు లేచి చేతులు కడుగుకొనిరి.

ఆనందరావుకూడ వెంకమ్మను తన అక్కగారి యింటికిఁ బంపవలయును గాఁబోలు నని యనుకొన్నాఁడు. తమలపాకులు వేసికొనుచు 'వెంకటరావూ! ఈ రెండు మెతుకులు మా యింటనే నంజుడువుగాని వెంకమ్మను మా యక్కగారియింటికి పంపుచుమీ!' అని అన్నాఁడు. అపుడు వెంకటరావునకు తన తక్కువతనమును, ఆనందరావు అధిక్యమును గోచరించినవి. అతఁడు 'చిత్తము' అని అన్నాఁడు. ఆనందరావు కనుఁగొనలేదు గాని దూరమునందున్న పాఠకుఁడు ఆతని యంగీకారములో ఎంత అనంగీకారమున్నదో తెలిసికొనకపోవఁడు.

౪

వెంకటరావు మెల్లమెల్లగా ఇంటికి నడిచి వెళ్లెను. విస్తళ్లు ఎత్తుకొని అపుడే వెంకమ్మ

ఇల్లు శుభ్రపఱచుచున్నది. పదునొకండు గంటలు వినఁబడినవి.

వెంకటరావు పరుండెను. వెంకమ్మపై తన యాధిపత్యము వినియోగింప కుతూహలమతనికి కలదుగాని ఆనందరావు నియోగమునఁ గలుగు నైచ్యము బయటఁబడక మానదని వెంకటరావు తన యాధిపత్యము నుపయోగింపఁ బూనుకొనలేదు. తప్పించుకొను నుపాయము లాలోచించుచుండెనుగాని యేయుపాయమైనను వెంకమ్మతో సంప్రతింపని దెటులు?

అతఁడు సహజసిద్ధమైన నిద్రను ఆలోచనలు పెట్టుకొని ఆఁపుకొనుచుండెఁగాని తుదకొక స్వప్న మారెంటిని ఆవలికి నెట్టి యాక్రమించుకొనియెను!' 'పాతమూరునుండి తొందరపనిమీఁద వచ్చి తనను లేపుచు 'నిఖామాను' వాకిట నిలువఁబడియున్నాఁడు. తాను లేచి వస్త్రములు సరుదుకొన్నాఁడు. వెంకమ్మను పంపకుండుటకు దైవముసాయము చేసెనని సంతోషించుచున్నాఁడు.' ఉలికిపడి లేచి 'శ్రీరాములూ శ్రీరాములూ!' అని పిలిచెను.

'పలవరించుచుంటివా యేమి, పండుకొనుము. శ్రీరాము లెక్కడినుండి యిపుడు వచ్చును?' అని వెంకమ్మ పలికెను. తన దురదృష్టమునకు వగచుచు వెంకటరావు శయనించెను.

తెలవారఁబోవుచుండఁగా ఆనందరావు కడనుండి వెంకటరావుకొఱకు జమాను వచ్చెను. వెంకటరావు వానిని గాంచి తటపటాయించెను. 'వచ్చెదను లెమ్ము, వెళ్లు' మని చెప్పెను.

'దగ్గఱ నుండి తీసికొని రమ్మన్నా' రని జమాను కదలలేదు.

వెంకమ్మను వారియింటికిఁ బంపుటకే వార్త! అందులకే జమాను దగ్గఱ నుండి తీసికొని వెళ్లుట! 'చీచీ, ఈయుద్యోగము మానుకొననిదో మానహాని. వెంకమ్మను వెళ్లవలదందునా? రాత్రి పంపుదు నంటిని. వెళ్లుమందునా? చీచీ; తల చితుకకొట్టుకొందును.' అని యిటులు మల్లగుల్లములు పడుచుండఁగా మఱియొక జవాను వచ్చెను. ఏమియుఁ దోఁపక 'ఈవిషయము వెంకమ్మకే వదలెద' ననుకొనుచు వెంకటరా వానందరావు నింటికి వెడలిపోయెను.

వాకిట పాతమూరి 'నిఖామాను' శ్రీరాములు కూర్చుండి యుండెను. కాకితములుసరి చేసికొనుచు కుర్చీలో కూగుచుండిన యానందరావు కిటికీనుండి కానిపించుచుండెను. శ్రీరాములు కానిపించుటతోడనే వెంకటరావు ముఖము మాఱెను. వడిగా నడచి 'శ్రీరాములూ! రాత్రి నన్ను పిలిచితివి కాదు?' అని యడిగెను. శ్రీరాములు తెల్లఁబోయి 'నేనిపుడే కదా వచ్చితిని అనెను. వెంకటరావు ఆనందరావుకడ కేఁగెను.

'గురవారాయనికి ప్రాణముమీఁదికి వచ్చినదఁట. ఆతని నోటునకు కాలదోషము పట్టుటచే ప్రాణమే పోయినది. మఱల దానికి ప్రాణప్రతిష్ఠ చేయించుకొని రమ్ము. రైలువేళ అయినది.' అని చెప్పుచు ఆనందరావు నోటు వెంకటరావున కిచ్చెను.

వెంకటరావు మనస్సు రెండువిషయములచే ఉక్కిరిబిక్కిరి యయినది: ఒకటి వెంకమ్మమాట యెత్తకుండుట; రెండవది తన స్వప్నప్రకారము ఇంచుమించుగా శ్రీరాములు వచ్చుట.

మఱిమాటలాడక వెంకటరావానోటు జేబులో వైచుకొని వంటయింటిదెస దొంగచూపులు చూచుచు బయటికి నడచెను. శ్రీరాము లతని ననుగమించెను. వెంటనే యింటికి వెళ్లి తాను పోతమూరు పోవుచున్నటులు తెలిపి రైలుసంచి తీసికొని రైలుకడకు నడచెను. రైలెక్కిన తరువాత అతని మనస్సున కాస్వప్నమును గుఱించి తలపోయుటకు అవకాశము చిక్కెను.

'నేటినుండియు నాలో ఏదియో ఒకశక్తి పనిచేయుచుండు ననుకొందును. నాకు కలలో ఏయుపాయము స్ఫురించునో అదియే యేల సిద్ధింపవలెను?' అని నడుమనడుమ ననుకొనుచు కలలోని ప్రతియంశమును గుఱుతునకుఁ దెచ్చికొని సంతసించుచుండెను. కాని జ్యోతి వెంకమ్మకు కబురంపి పిలిపించునేమో! వెంకమ్మ వెళ్లునేమో! తాను వెళ్లువఱకు రంగము మఱల మొదటికి వచ్చునేమో! అను సంశయముకూడ ఆసంతసము వెనుకనే లాపటము చేయఁబడియుండెను.

కొవ్వూరున దిగి పూఁటకూటియింటికి పుట్టింటికి వెళ్లినటులు వెళ్లెను. అచట అన్నము తినుచు రొట్టెలు వేయుచుండెను. పదార్థములు రుచ్యములుగా నున్నందులకు కాదు. మఱల సొంతగృహ మబ్బినందులకు శాస్త్రి సగము మాఁడిన యతని కడుపిపుడు బెత్తెఁ డుబికెను. లేచి వాకిటఁ బండుకొని యిటు లాలోచింపఁ దొడఁగెను: 'పొరుగింటి భోజనమునకు పూఁటకూటింటి భోజనమునకు పోలికా? అచట కావలసినది కూడ వలదు వలదని అఱతుము: ఇచట అక్కఱలేనిదికూడ కావలయునని దబాయింతుము. అచట చెంబులు మెల్లగా పెట్టుదుము: ఇచట సత్తువకొలఁది విసరి పాఱవైతుము. అచట మాటలాడము: ఇచట ఇల్లెగిరిపోవునటు లుపన్యాసము లిత్తుము. కావుననే పూఁటకూటి యిండ్లకు ఆనందభవనమని, ప్రమోదారామమని పేరులు.

మనదేశమున అతిథిపూజ అనునది కడు దురభ్యాసమయిన విషయము. తన పనిమీఁద నెచటనుండియో బయలుదేరి యెచటికో వెళ్లు విధవ హరియఁట! వాని కింటిల్లిపాది పూజ. కాని సామాన్యముగా అతిథులు తమకు కావలసినదానిని అడిగి పెట్టించుకొనను లేరు, ఇంటివారును చేయి విడిచి పెట్టను లేరు. అతిథులు సోమరులు; గృహస్థులు తమసర్వస్వము వారికి ధారపోసినటులు కనఁబడు వంచకులు.'

వెంకటరా విటులు తనలో తా నుపన్యసించుకొనుచుండఁగా శ్రీరాములొక బండి తెచ్చెను. వారు పోతమూరునకు పయనమయిరి.

౫

గోదావరిపై వేసవికాలపు గాడ్పులు బయలుదేఱినవి. ఇసుకతెరలు లేచి తెర

చాఁపలవలె కొట్టుకొనిపోవుచున్నవి. అవి ఆఁగిన పిదప చల్లనిగాలి వీతెంచినది. ఈయచే చిక్కి శల్యమైన గోదావరి యారోగ్యమునకు ఆగాలి వచ్చినటు లుండెను. ఆగాలి వెనుక వానదేవుఁడుకూడ చిటపట చినుకులతో బయలుదేరెను.

ప్రొద్దుగ్రుంకువఱకు వెంకటరావు పాత మూరు చేరెను. గురవారాయని వాకిట కాలు పెట్టెను. ఇఁక వాన కుండలతో పోసెను.

గుటగుటలాడుచున్న గురవారాయని ప్రాణము లుద్రేకించిన యామహాప్రాణములో లయము చెందునటులున్నవి కాని ఆనందరావున కితఁడు నోటు తిరిగి వ్రాసియిచ్చునా? యీయఁడా? చూత మనుకొని ఆఁగినటు లున్నవి.

కొంతసేపటికి వెంకటరా వందులకు వచ్చెనని గురవారాయనికి తెలిసెను. అతఁడు వెంటనే క్రొత్తనోటు వ్రాయించెను. అందు వ్రాలు పెట్టుటకు కలము చేతఁ బట్టుకొని ఒక యక్షరము వ్రాయువఱకు తల తిరిగి పఱుపుపై నొఱిగెను.

ఇటులు రెండు ప్రయత్నములు జరిగెను. రెండుమాఱులును మూర్ఛ వచ్చెను. గురవారాయని భార్య కృష్ణవేణి 'అయ్యో! మీపైకము పోదు; నేను నోటు వ్రాసియిచ్చెదను. మఱి మీరు బాధింపవల'దని ప్రార్థించెనుగాని వెంకటరావునకు ప్రాణమునందలి తీపి యేమి తెలియును; డబ్బునందుఁ గాని? అతఁడా రేయి నచటనే జాగరించెను.

సూర్యోదయమునకుఁగాని గురవారాయనికి స్మృతి కలుగలేదు. స్మృతి కలిగిన వెం

టనే వెంకటరావును బిలిచి నోటిమ్మని అడిగి పుచ్చుకొని అతి ప్రయత్నముతో ఇటు వ్రాలు పెట్టి అటు ప్రాణములు వదిలెను.

వెంకటరా వొక నిమిషమేని అచట నిలువలేకపోయెను. రేయెల్లయు వానకురియుటచే బండి కుదురలేదు. సమీపగ్రామమగు భట్టుపల్లిలో భోజనసదుపాయము శ్రీరాములు చెప్పఁగా నడచిపోయెను. రాత్రి ఉపవసించుటచేతను, ఎన్నఁడు నడిచినవాఁడు కాకపోవుటచేతను వెంకటరావు నడువఁజాలకపోయెను. నోటు తిరిగి వ్రాయించికొనిన సంతసమే అతని నెటులో నడిపించెను. పదునొకండు గంటలకతఁడు భట్టుపల్లి సమీపించెను. ఇఁక ఆగ్రామమున ఏ ఆనందభవనమునకో వెళ్లవచ్చునని యతని తలంపు.

గ్రామకంఠమునఁ జింతచెట్లక్రింద పశువులఁ గాచికొనుచు పదములు పాడుకొనుచున్న పైలాని జూచి 'యీయూర పూఁటకూటియిల్లు ఉన్నదా?' అని యడిగెను.

'చీ చీ, పల్లెటూరిలోఁ గూడ పూఁటకూటి యిల్లు ఉండవలసిన గతి యింకను పట్టలేద. వెళ్లవయ్యా, ఘుంఢీశ్వరులవారి యింటికి; నీబోటి వా రెందఱు వచ్చినను ఎన్నాళ్లున్నను పప్పలతో అన్నము పెట్టుదురు' అని వాఁ డనెను.

వెంకటరావు గుండెలు కొట్టుకొనెను. 'రాత్రి భోజనము లేదు; కాని కొఫ్ఫ్యే చేరువాఁడను. నేను వెళ్లి వైదిక బ్రాహ్మణునివలె ఊరక భోజనమిడుఁడని యెటులు ప్రార్థింపఁగలను?' అని అనుకొనుచు నడచుచుండెను.

చెఱువు మెట్లమీఁద కూరుచుండి మాధ్యాహ్నిక మొనర్చికొనుచు ఘుంఢీశ్వరుఁ డామాటలు వినెను. వెంకటరావు సమీపింపఁగా లేచి దాపునకు వచ్చి 'అతిథి ర్నారాయణో హరిః' అని నమస్కరించి 'తాము మాయింటికి భోజనమునకు దయచేయవలయును' అని ప్రార్థించెను.

'ఈయూర బండ్లు కుదురునా? నేను కొఫ్ఫ్యేరునకుఁ బోవలయును. భోజనమున కేమి లెండు!' అని వెంకటరా వనియెను.

'తమకు భోజనమునకు కొఱంతయని కాను. మట్టమధ్యాహ్నమున నడతెంచిన మీరు నారాయణులరు. మాయింట విందు కుడిచి గాని మఱిపో వీలు లేదు.' అని ఘుంఢీశ్వరుఁ డనెను.

వెంకటరా వట్టకేలకు సమ్మతించెను. నేను వెంట వచ్చి దిగవిడుతునని ఘుంఢీశ్వరుఁడు మెట్లెక్కఁ బోవుచుండఁగా వెంకటరావు 'ఇచటనుండి చూపుఁడు; మీరు రానక్కఱలే' దనఁగా ఘుంఢీశ్వరుఁడు 'అదిగో రావిచెట్టు! దాని కెదుటియిల్లే!' అని తెల్పెను. వెంకటరావు కాళ్లీడ్చుకొనుచు వారివాకిలి చేరెను.

చాలమంది అతిథులు దొడ్డిలో బ్రహ్మయజ్ఞము చేసికొనుచుండిరి. ఒకతె యిల్లు పరిశుభ్రపఱచుచుండెను. తాలింపు తావులు అతని బెల్లించుచుండెను. నడుమునకుఁ గట్టిన కంచితుండు అరుఁగుమీఁది చాఁపపై పఱచుకొని పడుకొనెను. ఆఁకటినుండి వేఱుపఱచి నిద్ర యతని నుపలాలించెను.

'అవిధినా కృత మకృతమ్' అనుకొనుచు ఘుంఢీశ్వరుఁడు మఱలఁ జెఱువులో సంధ్యావందనము మొదలయినవాని నన్నిటిని ముగించి యింటికి వచ్చెను. అతనిభార్య రంగవల్లి తీర్చి దీపారాధనము చేసెను. మాడి గట్టుకొని దేవతార్చన యారంభించెను.

'ఆహా! ఫస్టుబెల్ అయిన' దనుకొనుచు కనులు తుడుచుకొని వెంకటరావు లేచి కూరుచుండెను. భోజనమునకు పిలుచులోపల స్నాన మొనరించి వత్తు ననుకొని కొలఁకున కేఁగెను.

ఒకొక్కరే దేవతార్చనలు చేయుచుండిరి. ఒకరికన్న మఱియొకరు కాలస్యము చేయుచుండిరి. వారికి వచ్చిన ధ్యానశ్లోకములన్నియు నాలుగైదుమారులు లామ్రేడితము లగుచున్నవి. వెంకటరావు చెఱువునుండి వచ్చి పట్టుబట్ట కట్టుకొని వాకిటఁ గూరుచుండెను. అతఁడు నిదురచే తూఁగుచుండెను. గోడ కానుకొనియే అతఁడు కునికెను.

కొంత సేపటికి చెంబులు పైకెత్తి మంచి నీరు త్రాగు గళబిలధ్వనులు 'నేయితెమ్ము కూరతెమ్ము' అను పురమాయింపులు 'అన్నపూర్ణవంట' అను పొగడ్తలు వెంకటరావును లేపినవి. తనను కనుఁగొనలేదను మంట ఆఁకటి మంటకు తోడయినది. అతఁడు లోలోపల ఘంటేశ్వరునిపై కారాలు మిరియాలు నూరెను.

అతిథికి అన్నముపెట్టి తీఱవలసిన నియమ మేమేని కలదా? లేకపోయినను అతిథియే ఆనియమమును స్థాపించినాఁడు. తనను అగౌరవపఱచినాఁడను నేరము మోపుట కతిథికి సంపూర్ణమయిన అధికారము కలదని వెంకటరావున కెఱుకపడెను. ఆ నేర మెన్నటికిని పరిమృష్టము కాకుండ నుండవలయునని వెంకటరావు తలఁచెను. 'ప్రతిమూరను పూఁటకూటి యిండ్లుండుఁగాక! అందును ఘంటేశ్వరుని యిల్లు ఆనందభవన మగుఁగాక!' అని యాశీర్వదించెను.

అతిథులు నారాయణస్మరణ మొనర్చుచుండిరి. ఆ భగవన్నామ కీర్తనారస నిమగ్నుఁడైన ఘంటేశ్వరున కింతవట్టు వెంకటరావు గోచరింపలేదు. కొంత సేపటికి అందఱ మొగములు చూచినాఁడు. ఆ మొగములలో నీలాలకపరివేష్టితమగు మొగ మేది? అతని మొగమున క్షమించినను క్షాళితము కాదేమో యనునంత అపరాధము కానిపించెను. అతిథులందఱు తెల్లఁబోయి చూచుచుండిరి. భార్య పట్టుకొనిన పళ్లెము పట్టుకొనినపాళముగా నిలువఁబడి పోయినది.

ఘంటేశ్వరుఁ డంట్లచేతితో లేచి వాకిటి కరిగెను. వాకిలి శూన్యముగా నుండెను. నారాయణస్మరణ చేయుచు నతఁడు వీథిలోని కరిగెను. అంతయు శూన్యము, అంతయు శూన్యముగా నుండెను. 'నా నారాయణుని నేను పోఁగొట్టుకొంటిని, నా నారాయణుని నేను పోఁగొట్టుకొంటి'ననుచు నతఁడు శూన్యమును పరికించెను. అతని మనస్సాశూన్యమున లయము చెందెను.

కొంతవడి కతఁడు లేచి ఘంటాపథము వెంటఁ బరుగిడెను. కొలఁది దూరముననే బండిలో వెళ్లుచున్న వెంకటరావాతనికి కానిపించెను ఘంటేశ్వరుఁ డొక్కపరువున బండిని సమీపించి దోయిలి యొగ్గి 'నాయనా! నన్ను క్షమింపుము! నేను నిన్ను మరల కనుఁగొన మఱచితిని.' అని బండి వానితో తన ప్రమాదమును చెప్పికొని బండి నాఁపు మనెను.

వెంకటరా విషమంతయు నంగీకరింప

లేదు. ఘుంఘీశ్వరుఁడు పలుమాఱులు బతిమాలుకొనెను గాని వెంకటరావు 'నే నిఁక వెనుదిరుగను' అని చెప్పివైచెను. 'నేను బండి కట్ట'నని బండివాఁడు ఎద్దును విప్పివైచెను. వెంకటరా వొక్కఁ-దూఁకు దూఁకి పరుగిడ నారంభించెను. ఘుంఘీశ్వరుఁడు 'నాయనా! నీవు రాకున్న నే నిఁక మధ్యాహ్న భోజనము మానివైచెదను' అని ఒట్టిడుకొనెను. వెంకటరావు 'రాత్రిభోజనము కూడ మాను' మనెను.

ముందు వెంకటరావును వెనుక ఘుంఘీశ్వరుఁడును పరుగిడుచుండిరి. ఘుంఘీశ్వరునకు చాలివచ్చెను. అతఁడు బిగ్గఱగా

'ఆశాప్రతీక్షే సంగతం సూనృతాఞ్
చేష్టాపూర్తే పుత్రపశూంశ్చ సర్వాన్;
ఏతత్ వృంక్తే పురుష స్యాల్పమేధసో
యస్యానశ్నన్ వసతిబ్రాహ్మణో గృహే.'*

అని పఠించుచు నేలఁబడిపోయెను. అతనినోట మఱి మాటరాలేదు. ఆతనిశరీరమునుండి స్వేదము ప్రవహించి ఆఁగిపోయెను. ఆతని బండిపై వేసికొని బండివాఁడింటికిఁ తోలుకొని పోయెను.

[చిత్రకారుడు: శ్రీయుత అడవి బాపిరాజుగారు, బి. ఏ.,]

---

* ఎవనియింట బ్రాహ్మణుఁ డుపవసించునో వానికి రాఁగోరుకొను ఫలమును, వచ్చునను నమ్మికకల ఫలమును, సత్యవాక్ఫలమును, ఇష్టాపూర్తముల ఫలమును, పుత్రులును, పశువులును-ఈసర్వమును నశించును.

[కఠోప-౧-వ.]